# కొనుగోళ్లు లేక కలవరం

- కోతలు మొదలైనా ప్రారంభం కాని కేంద్రాలు
- అకాల వర్షాలతో పొంచి ఉన్న ముప్పు
- కల్లాల్లోనే ధాన్యం.. భయాందోళనలో రైతులు

కులకచర్ల, ఏప్రిల్ 20 : వరి కోతలు మొదలై పది రోజులు అవుతున్నా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు వరుణుడు అక్కడక్కడ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. కోసిన పంటను పొలాల్లో పెట్టిన రైతన్న కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభం అవుతాయోనని ఎదురు చూస్తున్నాడు. కొన్ని గ్రామాల్లో రైతులు తాము సిద్ధం చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులు, ఇతర వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఇంకా ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని.. తమకు రైతు భరోసా రాకున్నా ఇతర వ్యాపారుల నుంచి అప్పులు తీసుకొచ్చి పంటను సాగు చేశామని చెబుతున్నారు. ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో వారి కే తక్కువ ధరకు విక్రయిస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. రైతులను ఆదుకునేందుకు అనేక పథకాలను తీసుకొస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న ప్రభుత్వం గ్రామీ ణ ప్రాంతాల్లో కనీసం రైతులకు గిట్టు బాటు ధరను కల్పించేందుకు ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు ప్రా రంభించక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పీరంపల్లిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం


అంతారంలో సంచుల్లోకి ధాన్యాన్ని నింపుతున్న రైతు

### గతంలో ముందస్తుగానే కొనుగోళ్లు

బీఆర్ఎస్ హయాంలో ఏప్రిల్ మొదటి వారంలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే వారని రైతులు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో ముందుగానే ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. కులకచర్ల మండల పరిధిలోని రైతుల పొలాల్లో కోతలు కోసి పది రోజులు అవుతున్నా ఇంకా కేంద్రాలను ప్రారంభించకపోవడం విడ్డూరమన్నారు. గతేడాది ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అధికారులు ధాన్యాన్ని తీసుకోవాల్సి ఉండగా మండలంలో ఏ ఒక్క కేంద్రాన్ని ప్రారంభించలేదు. ఇందుకు ప్రధాన కారణం ఏమిటని నిర్వాహకులను ప్రశ్నిస్తే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు సమయం ఇవ్వాల్సి ఉందన్నారు. వారు వచ్చి ప్రారంభించిన తర్వాతే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. వరి కోతలు ప్రారంభమైన తర్వాత రైతులు ధాన్యాన్ని కల్లాల్లోనే ఎండి బెట్టి అక్కడే పెట్టుకున్నారు. వర్షాలు కూడా వస్తుండడంతో వర్షానికి ధాన్యం తడిసి పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కులకచర్ల మండలంలో 6,200ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు.

### కల్లాల్లోనే ధాన్యం

రైతులు తమ పొలాల్లో కోసిన ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబెడుతున్నారు. విక్రయానికి సిద్ధంగా ఉన్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులను అడిగితే ప్రజాప్రతినిధులు సమయం ఇస్తే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలియజేస్తున్నారు. దీంతో కల్లాల్లోనే ధాన్యం నిల్వ ఉంచారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ధాన్యం తడిసిపోతే ఎలా విక్రయించాలని ప్రశ్నిస్తున్నారు. రైతులే నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే పొలాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రైతుల ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ధాన్యం తడిస్తే గిట్టుబాటు ధర రాదు



అకాల వర్షాలు కురుస్తున్నాయి. పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి పోతే గిట్టుబాటు ధర రాదు. చేసిన కష్టానికి ప్రతిఫలం లభించదు. కోతలకు ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే వారు. ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ప్రారంభించాలి.

**- నర్సింహా, రైతు, లింగంపల్లి**

### త్వరలోనే ప్రారంభిస్తాం



ధాన్యం కొనుగోలు కేంద్రాలను వీలైనంత త్వరగా ప్రారంభిస్తాం. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన సామగ్రిని అందజేశాం. సంచులు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధుల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. రైతులు తమ ధాన్యాన్ని వర్షానికి తడువకుండా జాగ్రతగా ఉంచుకోవాలి.

**- వీరస్వామి, మండల వ్యవసాయాధికారి. కులకచర్ల**

## చెత్త అక్రమ డంపింగ్‌కు అడ్డుగోడ

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ఫిల్మ్‌నగర్-దర్గా దారిలో రోడ్డు పక్కన గుట్టలు గుట్టలుగా చెత్త వేయడంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నది. అటువైపు నుంచి వెళ్లే వాహనదారులతో పాటు చుట్టుపక్కల ప్రజలు వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై 'నమస్తే' 'ముక్కుపుటాలదిరేలా' శీర్షికతో మార్చి 8న ఫొటో వార్త ప్రచురితమైంది. స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు ఆ ప్రాంతంలో గోడ నిర్మించి, దానిపై సీసా పెంకులు ఏర్పాటు చేశారు. అక్కడ చెత్త వేస్తే రూ.పది వేలు జరిమానా విధిస్తామని బోర్డు పెట్టారు.





## దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

మొయినాబాద్, ఏప్రిల్ 20 : దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చిలుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ రోహిత్ ఎంపీకి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి జ్ఞాపికను ప్రదానం చేసి సన్మానించిన కళాశాల డైరెక్టర్ రోహిత్

## అకాల వర్షం.. నేల కొరిగిన చెట్లు


కడ్తాల్ : మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద కూలిన చెట్టు


కడ్తాల్: మైసిగండి మైసమ్మతల్లి ఆలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

కడ్తాల్, ఏప్రిల్ 20 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. వానకు మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద చెట్టు నేల కొరగ డంతో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కర్కల్‌పహాడ్ గ్రామంలో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభా లు నెల కొరకగా, కొన్ని చోట్ల విద్యుత్ తీగలు తెగి రైతుల పొలాల్లో పడ్డాయి. మైసిగండి మైసమ్మతల్లి ఆలయ ఆవరణలో నీళ్లు నిలవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

### ఈదురు గాలులకు కూలిన ఆవుల షెడ్

**ఆమనగల్లు (తలకొండపల్లి) :** తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో సాయంత్రం ఈదురుగాలులు రావడంతో చెట్లు కూలిపోవడంతో పాటు గ్రామా నికి చెందిన బొడ్డుపల్లి రవికి చెందిన ఆవుల షెడ్ పూర్తిగా కూలిపోయింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలన్నాడు.ఆమనగల్లు మండల పరిధిలోని కొత్త కుంటతండాలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గుర్రై కేతావత్ శంకర్‌కు చెందిన 4 మేకలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉన్నట్లు భాధితుడు శంకర్ తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

### పిడుగుపాటుకు పాడిఆవు మృతి

**కేశంపేట :** పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందిన ఘటన కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లిలో ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బడ్క సత్యనారాయణ వ్యవసాయం చేసుకుంటూ పాడి ఆవును నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం సాయంత్ర భారీ ఉరుములు, మెరుపులతో వర్షంతో పాటు పిడుగు పడడంతో పాడి ఆవు మృత్యువాత పడింది. నిరుపేద కుటుంబానికి చెందిన సత్యనారాయణకు పుట్టకతోనే మాటలు రావని, పాడిఆవును నమ్ముకొని కాలం వెళ్లదీస్తుంటే ప్రకృతి పగబట్టడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన ఆవు విలువ రూ.80వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కడ్తాల్ :కర్కల్‌పహాడ్‌లో రైతుల పొలంపై తెగిపడిన విద్యుత్ తీగలు


ఆమనగల్లు : వెల్జాల్‌లో కూలిన ఆవుల షెడ్ ముందు రైతు బొడ్డుపల్లి రవి

## అవయవదానంతో సరికొత్త జీవితం



కిడ్నీ మార్పిడి చేయించుకున్న పేషెంట్స్‌తో యశోద ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): యశోద హాస్పిటల్‌లో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్న రోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. కిడ్నీ మార్పిడికి ముందు ఉన్న ఆరోగ్య సమస్యలు, ఆ తర్వాత వచ్చిన ఆరోగ్య మార్పులపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా హాస్పిటల్ యాజమాన్యం ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. చేయూత ఫౌండేషన్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్, కేర్ ఫర్ యువర్ కిడ్నీ ఫౌండేషన్, కిడ్నీ వారియర్స్ ఫౌండేషన్ సహకారంతో యశోద హాస్పిటల్ హైటెక్ సిటీలో 'సెలబ్రేటింగ్ సెకండ్ ఛాన్సెస్-లైఫ్ విత్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ పేషెంట్స్' పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా అవయవ మార్పిడి చేసుకునేవారికి ఉండే అపోహలను తొలగించేలా అవగాహన కల్పించారు. యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జీఎస్ రావు, సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డా. రాజశేఖర చక్రవరి, యశోద హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

### యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు


ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని పలువురు వక్తులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరవధిక సమ్మె ఆదివారం కొనసాగింది. సెలవు దినం అయినప్పటికీ అధ్యాపకులు ఓయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేపట్టారు. అక్కడ టెంటు వేసేందుకు అధికారులు అనుమతించకపోవడంతో నేలపైనే కూర్చుని అధ్యాపకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 15 నెలల నుంచి వివిధ సందర్భాల్లో ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇవ్వడం, చర్చించడం జరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తీసుకొచ్చిన జీ.ఓ.నెం.21తో తమ ఉద్యోగాలకు అభద్రత ఏర్పడిందని వాపోయారు. తక్షణమే ఆ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. డాక్టర్ ధర్మ తేజ, డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ పరుశురామ్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఉపేందర్ పాల్గొన్నారు.



ఓయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

## నిమ్స్‌లో పటాకులెక్కడివి..?

### అగ్ని ప్రమాదంతో బయటపడ్డ భద్రతావైఫల్యం
### పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు
### ఆరోగ్యశ్రీ గదిలో ప్రత్యక్షమైన పటాకులు.. 24 గంటల్లో మాయం



ఖైరతాబాద్: వేలాది మంది రోగులు, వందలాది మంది వైద్య సిబ్బంది....24/7 సెక్యూరిటీ గార్డుల పహారా...అన్నింటినీ దాటుకుంటూ.. అగ్ని ప్రమాదకారకాలైన పటాకులు నిమ్స్ ఆస్పత్రికి చేరాయి. ఎమర్జెన్సీ వార్డులోని ఆడిటోరియానికి ఆనుకొని ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయంలో స్టాకుగా ఉన్నాయి. శనివారం ఆడిటోరియంలో జరిగిన అగ్ని ప్రమాదంతో ఈ భద్రతా వైఫల్యం బయటపడింది. ఈఎండీ వార్డులోనే పల్మనాలజీ, వాస్క్యూలర్, న్యూరో సర్జరీ, ఐసీయూ తదితర విభాగాలు ఉన్నాయి. మంటలు వ్యాపించి పటాకుల స్టాకుగా ఉన్న గది వరకు చేరి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం 3,500 మంది రోగులు వివిధ చికిత్సల కోసం ఆస్పత్రికి వస్తుంటారు. డైరెక్టర్‌తో సహా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వివిధ విభాగాలకు చెందిన నిష్ణాతులైన వైద్యులు నిత్యం రోగులకు వైద్య సేవలందించడంలోనే తలమునకలవుతారు. ఈ నేపథ్యంలో అందరి భద్రతను ప్రశ్నార్థకం చేస్తూ పటాకులు దర్శనమిచ్చాయి. అగ్ని ప్రమాదం జరిగిన క్రమంలో స్వయంగా నిమ్స్ వైద్యాధికారి పటాకుల విషయంలో విచారణ చేయాలని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు ప్రారంభించారు.

### నిన్న దర్శనం.. నేడు మాయం

నిమ్స్ ఎమర్జెన్సీ వార్డులోని ఐదో అంతస్తులోని ఆడిటోరియంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. సిబ్బంది ఫైర్ ఎస్టింగ్యూషర్లతో మంటలను ఆర్పివేశారు. అదే క్రమంలో దానికి ఆనుకొని ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులు బయటపడ్డాయి. ఉలిక్కిపడిన సిబ్బంది..పటాకులు ఎవరు తెచ్చారని ఆరా తీస్తే..అందరి నుంచి మౌనమే సమాధానంగా వచ్చింది.

పటాకుల విషయంపై నిమ్స్ వైద్యాధికారి ఒకరు పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తులో భాగంగా పోలీసుల బృందం దవాఖానలోని సదరు కార్యాలయానికి వచ్చి పరిశీలించగా, అవి మాయమయ్యాయి. అసలు తెచ్చిందెవరూ....మాయం చేసిందెవరూ....దీని వెనుక ఉన్నదెవరూ....24 గంటల్లో ఎలా మాయమయ్యాయి....తెచ్చిన వారే మాయం చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

### కొంపముంచిన సిగరెట్

సిటీబ్యూరో/ఖైరతాబాద్:నిమ్స్ ఆసుపత్రి అత్యవసర వైద్య విభాగంలో అగ్ని ప్రమాద ఘటనకు కాల్చి సగంలో పారేసిన సిగరెటే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఘటనాస్థలంలో విచారణ జరుపుతున్న సందర్భంలో సిగరెట్ ప్యాకెట్లు, కాల్చిపడేసిన సిగరెట్ ముక్కలు, బీడీలు, చెత్త కనిపించాయి. ఈ నేపథ్యంలో సిగరెట్, చెత్తతోనే అగ్నిప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు. నిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై విచారణ కొనసాగుతుండగా , పలు కీలక విషయాలు బయటపడ్డాయి. ఘటనకు లిఫ్ట్ పక్కనున్న చెత్తలో తాగి పారేసిన బీడీలు, సిగరెట్ కారణమని పోలీసుల తేల్చారు. ఖాళీగా ఉన్న స్థలంలో కొంతమంది సిబ్బంది చెత్తను వేయడంతో పాటు సిగరెట్ తాగి అక్కడ పడేశారు. అక్కడ ఉన్న బీడీ ముక్కలు, సిగరెట్లలో నుంచి నిప్పు పడడంతో చెత్త అంటుకుని మంటలు చెలరేగాయి. అది పైనున్న విద్యుత్ వైర్లకు అంటుకుని మంటలు వ్యాపించినట్లు పోలీసులు ధ్రువీకరించారు.

## త్రిశంకు స్వర్గంలో మెట్రో ఫేజ్-2

- విస్తరణ పనులకు ఆమోదం తెలపని కేంద్రం
- కొనసాగుతున్న పార్ట్-బీ డీపీఆర్ రూపకల్పన
- ఖజానా ఖాళీ అంటున్న సర్కార్
- ప్రాజెక్ట్‌కు ఆర్థిక వనరుల సమకూర్చేందుకు మల్లగుల్లాలు



సిటీబ్యూరో, ఏప్రిల్ 20, (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఎంతో కీలకమైనదిగా చెప్పుకునే మెట్రో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రెండో దశ(ఫేజ్-2) విస్తరణ ప్రణాళికలను కేంద్రం ఇంకా ఆమోదించలేదు. ఫేజ్-2 కింద దాదాపు 76 కిలోమీటర్ల పొడువుతో పలు మార్గాల్లో మెట్రోను విస్తరించేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.24వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉండగా... తాజాగా నార్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వీటిని ఫేజ్ -2 పార్ట్ బీగా చేపట్టేందుకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును మెట్రో సిద్ధం చేస్తోంది. అయితే పార్ట్-ఏ కు డీపీఆర్ అందజేసి నాలుగు నెలలు గడిచినా కేంద్రం ఇప్పటికీ ఆమోదించలేదు. నిత్యం మెట్రో అధికారులతో సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా పార్ట్ – బీలోని శామీర్‌పేట్, మేడ్చల్, ఫ్యూచర్ సిటీ మార్గాలకు ఈ నెలాఖరులోగా డీపీఆర్ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ .. కేంద్రం సంబంధిత డీపీఆర్‌ను ఆమోదిస్తే గానీ మెట్రో నిర్మాణం సాధ్యపడే పరిస్థితి లేదు.

### బీఆర్ఎస్ హయాంలోనే ప్రతిపాదనలు

వాస్తవానికి హైదరాబాద్ నగరానికి నలువైపులా మెట్రో విస్తరించాలనే ప్రతిపాదనలను మొదట బీఆర్ఎస్ ప్రభుత్వమే చేసింది. కోర్ సిటీతోపాటు, ఓఆర్ఆర్ దాటి మెట్రో మార్గాలను నిర్మిస్తామని స్పష్టం చేసింది. ఈ క్రమంలో నార్త్ సిటీ, ఈస్ట్ సిటీ, షాద్‌నగర్ వరకు, రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు మెట్రో మార్గాలను నిర్మిస్తామని ఎన్నికల సమయంలోనే హామీ ఇచ్చింది. అయితే అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ ప్రతిపాదనలను మార్చి... ఇతర మార్గాలను ప్రతిపాదించింది. దీనిని మెట్రో సెకండ్ ఫేజ్‌లో భాగంగా నాగోల్ నుంచి శంషాబాద్, రాయదుర్గం నుంచి నియోపోలిస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ్ గుట్ట, మియాపూర్ నుంచి పటాన్‌చెరు, ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మొత్తంగా 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసింది. సంబంధిత డీపీఆర్‌ను కేంద్రానికి మెట్రో సంస్థ అందజేసింది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రతిపాదించినా... ఇప్పటివరకు ఫేజ్-2 పార్ట్ బీ డీపీఆర్‌కు కేంద్రం నుంచి ఆమోదం లభించలేదు.

### సందిగ్ధంలో పార్ట్- బీ..!

నార్త్ తెలంగాణను అనుసంధానం చేయడంలో కీలకంగా మారిన నార్త్ సిటీ మెట్రో ప్రాజెక్టు ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉంది. జేబీఎస్ నుంచి శామీర్ పేట్, మేడ్చల్ వరకు రెండు మార్గాల్లో మెట్రో నిర్మిస్తామని హెచ్ఎంఆర్ఎల్ ప్రకటించింది. దాదాపు 45 కిలోమీటర్ల పొడువైన ఈ మార్గంతో నార్త్ సిటీ నుంచి కోర్ సిటీకి మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తోంది. కానీ ఈ విషయంలో ప్రభుత్వం కొంత నిర్లక్ష్యం చేయడంతో పార్ట్ – ఏలోనే రావాల్సిన ప్రాజెక్టును పార్ట్ – బీగా డీపీఆర్ సిద్ధం చేయాలని మెట్రో సంస్థను ఆదేశించింది. అయితే ఇటీవల నగరంలో మెట్రో విస్తరణ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో పార్ట్ బీలో ఉన్న జేబీఎస్, శామీర్‌పేట్, మేడ్చల్ మార్గాన్ని ప్రస్తావించలేదు. కానీ సీఎం రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్టుగా చెప్పుకునే ఫ్యూచర్ సిటీ విస్తరణ, డీపీఆర్‌పై విస్తృతంగా అధికారులతో చర్చించారు. ఈ క్రమంలో పార్ట్ బీ డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేసినా... కేంద్రం ఆమోదించేంత వరకు ఆగాల్సిందే. ఇప్పటికే రెండేళ్లుగా నార్త్ సిటీ మెట్రో కోసం స్థానికులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో... ప్రభుత్వం చేస్తున్న జాప్యం ప్రాజెక్టును సందిగ్ధంలో పడేసింది. అదేవిధంగా కేంద్రం డీపీఆర్ ఆమోదించినా.. మిగిలిన ప్రాజెక్టుల కంటే ముందుగా శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మార్గాన్ని ముందుగా నిర్మించే అవకాశమే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఖజానా ఖాళీ.. ఆర్థిక వనరులు ఎలా?

పార్ట్ – బీలో ఉన్న 85 కిలోమీటర్ల పొడవైన మెట్రో ప్రాజెక్టుకు కనీసం రూ.30వేల కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో వీటిని కూడా కేంద్ర, రాష్ట్రాల వాటాలతో నిర్మించేందుకు తలపెట్టినా.. కేంద్రం నిధులు ఇచ్చేందుకు ఆమోదిస్తే గానీ ప్రాజెక్టును చేపట్టడం సాధ్యం కాదు. మెట్రో ఫేజ్-2లోని పార్ట్ – ఏకు రూ.25 వేల కోట్లు, పార్ట్ – బీకి మరో రూ.30 వేల కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదించి... కేంద్ర వాటాగా 18శాతం చొప్పున చెల్లించి, మిగిలిన మొత్తానికి ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు పూచీకత్తు అందిస్తే గానీ ప్రాజెక్టు పట్టాలెక్కదు. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉండటంతో.. నేరుగా ప్రాజెక్టుకు ఆర్థిక వనరులు సమకూర్చే వీల్లేని పరిస్థితుల నడుమ ప్రాజెక్టును ఎలా నిర్మిస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## పతంజలి ఔషధాలతో సోరియాసిస్‌కు చెక్

ఆచార్య బాలకృష్ణ సిటీ బ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): పతంజలి ఉత్పత్తి చేసిన సోరోగ్రిట్ ట్యాబ్లెట్, దివ్య తైల ఔషధాలు సోరియాసిస్ నుంచి విముక్తి కలిగిస్తాయని ఆ సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పతంజలి వైద్యుల పరిశోధనలు ప్రపంచ ప్రఖ్యాత టేయిలర్, ఫ్రాన్సిస్ మ్యాగజైన్‌లో ప్రచురితమయ్యాయని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా సోరియాసిస్ వ్యాధిని అంత మొందించడానికి ఎన్నో పరిశోధనల ద్వారా మందులను తయారు చేసిన వైద్యులను ప్రశంసించారు. తమ వైద్యుల పరిశోధనలకు ప్రపంచ వ్యాప్తంగా పేరు రావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.